క్లుప్తంగా

డాక్టర్ గణేష్‌కు కోన పరామర్శ



రేపల్లె: వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఇటీవల అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని ఆయన స్వగృహంలో డాక్టర్ గణేష్‌ను వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి కలిసి పరామర్శించారు. గణేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె: మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని మండలంలోని పేటేరు గ్రామంలో శనివారం అదుపులోకి తీసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రేపల్లె ఎస్ఐ రాజశ్రీ వివరాలను వెల్లడించారు. పేటేరు గ్రామానికి చెందిన బొందలపాటి మహేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందటంతో తమ సిబ్బందితో దాడులు చేయగా గ్రామంలోని అంకమ్మ చెట్టు వద్ద మద్యం విక్రయాలు చేస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, వాటిని సీజ్ చేశామన్నారు.

విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందించాలి



బాపట్ల అర్బన్: చిన్నప్పటి నుంచే చిన్నపిల్లలో స్నేహభావాన్ని పెంపొందించాలని భాష్యం జోనల్ అధికారి హృదయరాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక భాష్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా జోనల్ అధికారి హృదయరాజ్ మాట్లాడుతూ చిన్న పిల్లలకు స్నేహం, సామాజిక నైపుణ్యాల ప్రాముఖ్యతను నేర్పించడానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులకు సానుభూతి, దయ, సహాయ సహకారాల వంటి భావాలను అర్థం చేసుకోవడానికి ఇది వారికి సహాయపడుతుంది. విద్యార్థులు తీసుకువచ్చిన గ్రీటింగ్ కార్డులను తమ స్నేహితులకు ఇచ్చేందుకు స్వయంగా విద్యార్థులతో తయారు చేయించారు. పాఠశాల హెచ్ఎం ఐజీ కృష్ణారెడ్డి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి స్వాతి పాల్గొన్నారు.

జనం నడ్డి విరుస్తున్న ప్రభుత్వం



చివలూరు(కొల్లిపర): రాష్ట్రంలో విద్యుత్ భారం తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన కూటమి ప్రభుత్వం తగ్గించపోగా, భారీగా చార్జీలు పెంచి, ప్రజల నడ్డి విరుస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చివలూరు, దావులూరు గ్రామాల్లోని స్మార్ట్ మీటర్ వద్దు, విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని కోరుతూ శనివారం ప్రజల వద్ద నుంచి సంతక సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి విద్యుత్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీలతో వినియోగదారులపై పెరుగుతున్న భారం గురించి వివరిస్తూ సంతకాలు సేకరించారు.

సర్దుబాటు పేరుతో అ'ధన'పు భారం..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాటి నుంచి ఇప్పటి వరకు నాలుగు రకాల సర్దుబాటు చార్జీలు పేరుతో వినియోగదారులపై రూ.15,485 కోట్లు అదనపు భారం వేసిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన అనంతరం దుకాణాలు, చిన్న పరిశ్రమలకు రెండు, మూడు రెట్లు చార్జీలు పెరగటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పాత విద్యుత్ మీటర్లను కొనసాగించాలని, పాత రీడింగ్ పద్ధతిని అమలు చేయాలని, ఇప్పటి వరకు షాపులకు పెట్టిన మీటర్లు తొగించాలని, రానున్న రోజుల్లో గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని వంటి అంశాలపై వినియోగదారుల వద్ద నుంచి సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' లబ్ధి పొందాలి

భట్టిప్రోలు: అర్హులైన ప్రతి ఒక్క రైతులు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందాలని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం భట్టిప్రోలు-1 రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఏడాదికి రూ. 20 వేలు పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. మొత్తం 3 విడతలలో నగదు జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సర్పంచ్ దారా రవి కిరణ్మయి, డీటీ శాంతాలక్ష్మి, వీఏఏ డి.నాగూర్ వలి, రైతులు పాల్గొన్నారు.



అశోక్‌బాబును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున



పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు



పరామర్శిస్తున్న తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పరామర్శిస్తున్న పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

దళిత నేత అశోక్‌బాబుపై దాడి హేయం

- దీక్షను అడ్డుకోవడం దుర్మార్గం
- రేపల్లె ఆస్పత్రిలో ఉన్న వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటికి పలువురి పరామర్శ

రేపల్లె: తూటికాడను తొలగించి రైతులకు మేలు చేయాలని కోరుతూ ఇరిగేషన్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు చేపట్టిన దీక్షను అడ్డుకునే నెపంతో పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి దాడి చేయటాన్ని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరి చికిత్సను నిరాకరిస్తూ దీక్ష కొనసాగిస్తున్న అశోక్‌బాబును



వరికూటి అశోక్‌బాబును పరామర్శిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

శనివారం పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మాజీ మంత్రి, కృష్ణాజిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పేర్ని వెంకట్రామయ్య (నాని), మాజీ మంత్రి, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబులతో పాటు తెనాలి, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు వరికూటి అమృతపాణిలతో పాటు పలు దళిత సంఘాల నాయకులు అశోక్‌బాబును పరామర్శించి సంఘీభావం తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

బాపట్ల అర్బన్: బాపట్ల నియోజకవర్గంలో రోజు రోజుకి అభివృద్ధి కుంటుపడుతూ ఉందని నియోజవర్గ ప్రజా ప్రతినిధులు,అధికారులు తక్షణమే స్పందించి అభివృద్ధిపై దృష్టి సారించాలని బాపట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ గంటా అంజిబాబు సూచించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్లలో రూ.550కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు నిలిచిపోతే అధికారపార్టీ పట్టించుకోకపోవటం విచారకరమన్నారు. మరోవైపు టూరిజం అభివృద్ధి కూడా సరిగాలేదన్నారు. పట్టణ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లు పనిచేయక ఇక్కట్లు

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయక అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.అగస్టీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందజేసిన టూజీ నెట్‌వర్క్ ఫోన్లు సిగ్నల్ లేక సర్వర్లు పని చేయకపోవడం వల్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని యాప్‌లను ఒకే యాప్‌గా మార్పు చేయాలన్నారు. కార్యకర్తలకు 5జీ నెట్‌తో ట్యాబులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పంటలకు గిట్టుబాటు ధర ఏది బాబు?

- మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెం, పెదపులుగువారిపాలెంలలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' రచ్చబండ సభలు



కర్లపాలెం రచ్చబండ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఎందుకు కల్పించలేకపోతున్నావు చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రశ్నించారు. శనివారం రాత్రి కర్లపాలెం, పెదపులుగువారిపాలెం గ్రామాలలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండల అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కోన రఘుపతి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.1800 చెల్లించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి రైతుల అకౌంట్‌లో నగదు జమ చేశారని తెలిపారు. నేడు చంద్రబాబు ప్రభుత్వం ధాన్యానికి రూ.1400 కంటే ఎక్కువ ఇవ్వటం లేదని ధాన్యం అమ్మిన రైతులు నగదు కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పంటల బీమాకు సంబంధించి రైతులు చెల్లించాల్సిన ప్రీమియంను వైఎస్ జగన్ ప్రభుత్వమే రూ.716కోట్లు చెల్లించిందని నేడు చంద్రబాబు హయాంలో బీమా నగదు రైతులనే చెల్లించమంటున్నారని కోన చెప్పారు.

మెడికల్ కాలేజీని గాలికొదిలేశారు

గతంలో కంటే మెరుగైన పరిపాలన అందిస్తామని చెప్పిన చంద్రబాబు ఒక్క పథకమూ సక్రమంగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రూ.510కోట్లతో బాపట్లలో మొదలుపెట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాల, వైద్యశాల నిర్మాణ పనులను ఈ ప్రభుత్వం నిలిపివేసిందని, దీంతో అక్కడ పిచ్చి చెట్లు పెరిగి అడవిని తలపిస్తోందని కోన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిక్కాల సాగర్, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు ఎండీ అమీర్‌బేగ్, ఆసిఫ్ అలీ, ఆట్ల నాగేశ్వరరెడ్డి, జయభారత్‌రెడ్డి, పీవీ సురేష్, షంషీర్, ఇమ్రాన్, కాగిత మహేష్, జానీ, ఆట్ల పోలిరెడ్డి, హరిబాబు రెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, స్వామిరెడ్డి, శివారెడ్డి, రత్నం, మనోహర్ ఉన్నారు.

డీజిల్ దుర్వినియోగం చేస్తే చర్యలు

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు



తెనాలిఅర్బన్: మున్సిపల్ వాహనాలకు డీజిల్ పట్టించే విషయంలో సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు సూచించారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలోని మున్సిపల్ వాహనాల డ్రైవర్లతో శనివారం ఐతానగర్‌లోని వెహికల్ షెడ్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజిల్ దుర్వినియోగం అవుతుందనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, అలాంటివి జరగకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా డీజిల్ అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే సహించేది లేదన్నారు. విధుల నుంచి తొలగించడానికి కూడా వెనుకడబోమని హెచ్చరించారు. అందరూ అప్రమత్తంగా ఉంటూ డీజిల్ విషయంలో ఎక్కడా అక్రమాలు జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు

స్థల యజమానులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

రేపల్లె: జనావాసాల నడుమ ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి, దోమలకు, విష పురుగులకు నిలయంగా మారిన వైనంపై 'నివాసాల మధ్య ముళ్ల పొదలు - తీరేనా వెతలు' శీర్షికన ఈనెల 1వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు స్పందించారు. పట్టణంలో పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లతో పెరిగిన ఖాళీస్థలాలను శనివారం పరిశీలించి ఆయా స్థలాలలో 'ఈ స్థలం పురపాలక సంఘానికి చెందినది' అంటూ బోర్డులను ఏర్పాటు చేసి అనంతరం మాట్లాడారు. ఖాళీ స్థలాలలో చెట్లు పెరిగి పాములు, విషకీటకాలు చేరి చుట్టుపక్కల వారు భయపడే పరిస్థితి ఏర్పడుతోందని, స్థలాలలో చెత్త చెదారాలు వేస్తుండటంతో చిన్నపాటి వర్షానికే నీరుచేరి దోమలకు నిలయాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు పట్టణంలో పర్యటించి పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లతో కూడిన ఖాళీ స్థలాలను గుర్తించి ఆయా స్థలాల యజమానులకు స్థలాలను శుభ్రపరుచుకునేలా నోటీసులు అందించామని, స్థల యజమానుల వివరాలు తెలియని స్థలాలలో బోర్డులను ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు. ఆయనవెంట శానిటరీ ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



బోర్డు ఏర్పాటు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, సిబ్బంది

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్
- పలు మద్యం దుకాణాల్లో తనిఖీలు



చెరుకుపల్లి మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్

రేపల్లె: ఎమ్మార్పీ కంటే అధికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నగరం సీఐ శ్రీరామ్ ప్రసాద్ చెప్పారు. చెరుకుపల్లి మండలంలోని పలు వైన్‌షాపులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను దుకాణాల యజమానులు పాటించాలన్నారు. ఎమ్మార్పీ ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. క్వార్టర్, ఫుల్, హాఫ్ ఏదైనా ఎమ్మార్పీకే విక్రయాలు జరపాలన్నారు. రూ.99ల క్వార్టర్ బాటిల్‌ను రూ.100లు చెల్లించి కొనుగోలు చేసే వినియోగదారునికి తప్పనిసరిగా రూ.1 చెల్లించాలన్నారు. ఎమ్మార్పీల అమలుపై నిరంతరం నిఘా, పరిశీలన ఉంటుందన్నారు. ఇటువంటి ఉల్లంఘనలపై వినియోగదారులు నేరుగా టోల్ ఫ్రీ 14405 నంబరుకుగాని, 94904 55599 నంబరుకుగాని ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

5న విద్యుత్ సమస్యలపై ధర్నా

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



జగనన్న కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న మణిలాల్

రేపల్లె: విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, వివిధ రూపాల్లో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ప్రస్తుతం పెంచబోతున్న రూ.12,771 కోట్ల విద్యుత్ పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలన్న డిమాండ్‌తో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. ఈమేరకు పట్టణంలోని 11, 18, 21, 22 వార్డులలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం అదానీ కోసమే స్మార్ట్ మీటర్లు బిగిస్తూ విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను స్మార్ట్‌గా పెంచేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలని, పెట్టిన మీటర్లు తొలగించాలని, ట్రూ అప్ కింద ఛార్జీలు, సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా తొలగించాలని, ఇప్పటివరకు వసూలు చేసిన సర్దుబాటు చార్జీలను తిరిగి చెల్లించాలన్న డిమాండ్‌లతో జరిగే ధర్నాలో పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. సీపీఎం నాయకులు రమేష, ఆశీర్వాదం, వి.ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీఓ ఎం.సుచిత్ర తదితరులు

రేపల్లె: చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాల్సిందేనని సీడీపీఓ ఎం.సుచిత్ర తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని 25, 26వార్డులలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. అప్పుడే జన్మించిన బిడ్డకు అరగంటలోపు తల్లిముర్రుపాలు పట్టించాలన్నారు. డబ్బా పాలతో బిడ్డ అనారోగ్యంపాలవ్వక తప్పదని, వ్యాధి నిరోధక శక్తిని పొందలేరని సూచించారు. తల్లులు తమ చిన్నారులకు తన పాలు పట్టించటంతో పాటు తాము పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. సూపర్‌వైజర్ హిమబిందు, హెచ్ఎం ఎం.సుశీల, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, ఏఎన్ఎం దీప్తి, ఎంఎస్‌కే నంది, అంగన్‌వాడీ కార్యకర్త కనకదుర్గ, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- జిల్లా సమన్వయ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రంగారావు
- కొల్లిపర సీహెచ్‌సీలో తనిఖీలు



కొల్లిపర: వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా సమన్వయ ఆరోగ్య శాఖాధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ రంగారావు అన్నారు. మండలకేంద్రం కొల్లిపర గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రోగులకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. వార్డులో ఉన్న రోగులను డాక్టర్లు, సిబ్బంది పనితీరు ఎలా ఉంది.. మందులు అన్నీ ఇస్తున్నారా? లేదా? బయటకు ఏమైనా రాస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఆరోగ్య శ్రీ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలకు జనరల్ సర్జన్‌ను నియమించాల్సి ఉందని, ఒక నెలలోపు నియామకం జరుగుతుందన్నారు. రాత్రిళ్లు వైద్యులు తప్పనిసరిగా ఉండి అత్యవసరమైన సేవలు అందించాలని సూచించారు. సీహెచ్‌సీకి ఎక్స్‌రే, బ్లడ్ బ్యాంక్ స్టోరేజీ ఈ రెండు సేవలు మరో సుమారు 30 రోజుల్లో ప్రారంభించి రోగులకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు.

బయటకు రాస్తే ఫిర్యాదు చేయండి..

వైద్యశాలల్లో ఎటువంటి మందులు కొరత లేదని, ఎవరైనా మందులు బయటకు రాసినా, లేవు అని చెప్పిన వెంటనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇక నుంచి ప్రతి వైద్యానికి ఆరోగ్య శ్రీ లో నమోదు చేయటం జరుగుతుందన్నారు. దీంతో మందులు కొరత వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటుందన్నారు. వైద్యశాలకు వచ్చే రోగులకు ఆధార్, ఆరోగ్య శ్రీ కార్డు వారి వెంట తీసుకువచ్చే విధంగా వైద్యులు ప్రతి రోజులో వారి వద్దకు వచ్చే రోగులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా సీహెచ్‌సీ కాన్పులు తక్కువగా నమోదు అవుతున్నాయని, ఇక నుంచి ఎక్కువ శాతం నమోదయ్యేవిధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ రోజు తన ఆధ్వర్యంలో ముగ్గురికి ఆపరేషన్ ద్వారా కాన్పులు చేసినట్లు తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణి, వైద్యులు సుప్రియ, గంగాధర్, అనూష, హెడ్‌నర్స్ కె.సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.